"స్వామీ! నేనేం తప్పు చేసానని మీరు నా వంక చూడనైనా లేదు?"

"నువ్వు భగవంతుడి కంటే గొప్పవాడివని భావిస్తున్నావు కనుక." కొంచెం కోపంగా చెప్పాడు ఆ యోగి.

"ఛ ఛ! నేనలా ఎన్నడూ అనుకోవడం లేదే?"

"అనుకోవడం లేదా? నిత్యం నీ పూజయ్యాక కళ్ళు మూసుకుని ఏం ప్రార్థన చేస్తావో చెప్పు నాకు. అప్పుడు నీ దోషం చెప్తాను." అన్నాడాయన.

"ఏముంది? స్వామీ నా కుటుంబాన్ని చల్లగా కాపాడు. నా పొలంలో పంట బాగా పండేలా చెయ్యి. మా అమ్మ అనారోగ్యం తగ్గించు. నాకు ఇంకా ధన, ధాన్యాలివ్వు అని."

"దేవుడికి అలా సూచనలివ్వడానికి నువ్వు దేవుడి యజమానివా? నీకేం ఇవ్వాలో నువ్వు చెప్తే కానీ తెలుసుకోలేని మూర్ఖుడా నిన్ను సృష్టించిన దేవుడు? నీకన్నా ఆయనకే ఎక్కువ తెలుసు అని గుర్తుంచుకో. ప్రార్థన అనేది మనం చేసిన పాపాలని క్షమించమని, దేవుడి మీద విస్మృతి కలగకుండా ఉండాలని, ఇతరులని సౌఖ్యంగా ఉంచమని కోరడానికే. భగవంతుడ్ని ప్రార్థన ద్వారా ఇంకేం కోరినా అది నీ మూర్ఖత్వమే అవుతుంది."

ఆ బోధనతో అతని కళ్ళు తెరచుకున్నాయి. ఆ తర్వాత అతను దేవుడ్ని సరిగ్గా ప్రార్థించడం నేర్చుకున్నాడు.

## 17. దేవుడి ఇంటికి దగ్గరి దారి

'రామాపురం' అనే ఊళ్ళో రైలు దిగండి.

'నమ్మకం' అనే రిక్షాని మాట్లాడుకోండి.

'భక్తి' అనే పేటలోకి తీసుకెళ్ళమనండి.

'పాపం' అనే డెడ్ ఎండ్ వీధి వస్తుంది.

'పుణ్యం' అనే దాని ఎదురు సందులో ముందుకి సాగండి.

'ప్రార్థన' అనే వంతెనని దాటండి.

'కర్మ' అనే సర్కిల్ వస్తుంది.

'దుష్కర్మ' అనే రెడ్‌లైట్ అక్కడ వెలుగుతూండవచ్చు.

'సుకర్మ' అనే పచ్చలైటు వెలిగాక ముందుకి సాగండి.

'భజన మండలి' అన్న బోర్డున్న కుడి రోడ్డులోకి మళ్ళండి.

అక్కడ రోడ్డు నాలుగు రోడ్లుగా చీలుతుంది.

మొదటి మూడిటి పేర్లు,'అసూయ స్ట్రీట్, ద్వేషం సందు, ప్రతీకారం వీధి.'

వాటిని వదిలి నాలుగో సందులోకి తిరగండి. దానిపేరు 'సత్సంగం వీధి.'

పక్కన కనబడే 'వదంతుల వీధి' లోకి వెళ్ళకండి. అది వన్ వే రోడ్డు.

కాస్తంత ముందుకి వెళ్ళాక ఓ జంక్షన్ వస్తుంది. అక్కడ ఎడమ వైపు రోడ్డు పేరు 'వ్యామోహం'. కుడివైపు రోడ్డు పేరు 'వైరాగ్యం'.

'వ్యామోహం వీధి' లోకి వెళ్ళే ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది.

అయినా అటు వెళ్ళక 'వైరాగ్యం వీధి' లోకే వెళ్ళండి.

ఎదురుగా మీకు'కైవల్యం' అనే మరో చౌరస్తా కనిపిస్తుంది.

'దయ గల హృదయం భగవన్నిలయం' అన్న బోర్డుకి ఉన్న బాణం గుర్తు వైపుకు వెళ్ళండి.

ఆ 'జ్ఞానమార్గ్' వీధిలో 'ఆత్మ కుటీర్' అన్న బోర్డున్న తెల్లరంగు ఇల్లు కనిపిస్తుంది. గేటు దగ్గరున్న 'ముక్తి' అనే తలుపు మిమ్మల్ని చూడగానే తెరచుకుంటుంది.

ఇది దేవుడి ఇంటికి సరైన దగ్గరి దారి.

(మీరు మీ బంధుమిత్రులకి కూడా ఈ దారిని తెలపండి. లేదా సరైన దారి తెలియక వారు దారి తప్పి పోవచ్చు.)